క్లుప్తంగా

మాట ప్రకారం పింఛను పెంచిన ఘనత సీఎం జగన్‌దే



నగరంపాలెం: మాట ప్రకారం విడతలు వారీగా రూ.3 వేలకు పింఛను పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ అన్నారు. వైఎస్సార్ సామాజిక పెన్షన్లను గురువారం ఆర్.అగ్రహారం 58, 59వ సచివాలయాల పరిధిలో ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నూనె కిషోర్, గృహ సారథులు నాగసుధీర్, రమణ స్వామి, వసంత్‌రాజు, రాజబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గుంటూరు మెడికల్: నిత్యం రోగుల సేవల్లో ఆసుపత్రుల్లో ఉండే వైద్యులు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పొందుతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ బూసి రెడ్డి నరేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని కేపీఆర్ కాంటినం క్రీడా ప్రాంగణంలో నాలుగోరోజు జరిగిన షటిల్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం డాక్టర్ ధనుంజయరావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్యుల్లో అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఐఎంఏ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు జరుగనున్న ఫైనల్స్ సెమీఫైనల్స్‌లో పాల్గొనేందుకు డాక్టర్లందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారని వెల్లడించారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ జాన్ షాహిద్, డాక్టర్ అస్లాం, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రదీప్, పలువురు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు స్థిరాస్తి హక్కుచట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం

గుంటూరు మెడికల్: రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో స్థిరాస్తి హక్కు చట్టం వరమా? శాపమా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు నడింపల్లి గురుదత్, అవధానుల హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రాడీపేట రెండోలైన్‌లోని బాలానంద కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం.వి.రాజారామ్ ప్రధాన వక్తగా పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ రంగాల నిపుణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని జాయింట్ సెక్రటరీ డాక్టర్ టి.సేవకుమార్ కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెహ్రూనగర్: ఎన్విరాన్మెంట్ సెక్రటరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని గ్రామ/వార్డు సచివాలయం ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు సీడీఎంఏ కోటేశ్వరరావును గురువారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయం ఎన్విరాన్మెంట్ సెక్రటరీల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్విరాన్మెంట్ సెక్రటరీల టైమింగ్ మార్పు, సర్వీసెస్, ప్రమోషన్ ఛానల్ అంశాలపై సీడీఎంఏకు విన్నవించామన్నారు. ఎన్విరాన్మెంట్ సెక్రటరీల ప్రతినిధులు కె.బుల్లియ్య, మాధవరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు ఉన్న బ్యాగు చోరీ

గుంటూరు ఈస్ట్: కల్యాణ మండపంలో బంగారు గొలుసు ఉన్న బ్యాగు చోరీ జరిగిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధార్థ గార్డెన్స్ కల్యాణ మండపంలో బుధవారం వివాహం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి వివాహ వేదికపై వంద గ్రాముల బంగారు గొలుసు ఉన్న బ్యాగును చోరీ చేశాడు. ఈఘటనపై డాక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో గురువారం సీఎస్ఈ–డీఎస్ విభాగం విద్యార్థులకు డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దివాన్, అమెజాన్ డిజైన్ థింకింగ్ అనలిస్ట్ శ్రీకాంత్ హాజరయ్యారు. డిజైన్ థింకింగ్‌లో మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. మలినేని ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు ఇన్నోవేటివ్ వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, డీఎస్ హెచ్‌వోడీ హరికృష్ణ, డీఎస్ రమేష్ పాల్గొన్నారు.

యుద్ధానికి సన్నద్ధం కావాలి

- సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం
- ఇక నిత్యం డివిజన్ పర్యటనలు
- బూత్ లెవల్ కమిటీల నుంచి పటిష్టం
- ఐక్యంగా ముందుకు సాగుదాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, పశ్చిమ సమన్వయకర్త విడదల రజిని
- పశ్చిమ ముఖ్య నేతలు, కార్పొరేటర్లతో సమావేశం
- హాజరైన ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని, వేదికపై ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి

పట్నంబజారు: 'ఎన్నికల యుద్ధం మొదలు కాబోతోంది.. అలుపెరుగని పోరాట యోధులు వైఎస్సార్ సీపీ సైనికులు.. ఇక సమరానికి సిద్ధం కావాలి.' అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని కార్యకర్తల్లో సమరోత్సాహం నింపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ముఖ్యనేతలు, డివిజన్ అధ్యక్షుల సమావేశం కొరిటెపాడు ప్రధాన రహదారిలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రం చీకటిమయంగా మారిన వేళ.. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సుదీర్ఘ పాదయాత్ర చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ.. చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ఎన్ని కష్టాలు.. ప్రతిపక్షాల కుయుక్తులు ఎదురైనా.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ప్రజల కోసమే పాటుపడిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆదర్శవంతమైన పాలనే తిరిగి మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కడుతుందని స్పష్టం చేశారు. సంక్షేమాన్ని ప్రతి గడపకు చేర్చిన జగనన్న పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని, రానున్న ఎన్నికల్లో ఆయనే తమ బలమని స్పష్టం చేశారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడేందుకే తనను జగనన్న పంపారని మంత్రి రజిని పేర్కొన్నారు. ఇప్పటికే డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించామని, పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించుకున్నామని చెప్పారు. పార్టీ సంబంధించిన అన్ని కార్యకలాపాలు, ఎన్నికల కసరత్తును వేగవంతం చేసుకున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో మరింతగా దూసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

నేటి నుంచి డివిజన్ల వారీ పర్యటనలు

పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం నుంచి డివిజన్‌లలో పూర్తిస్థాయిలో పర్యటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి డివిజన్‌ను సందర్శించటం, ఆయా డివిజన్‌లలో పాదయాత్ర, గెట్ టు గెదర్ లాంటి కార్యక్రమాలు చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. బూత్ కన్వీనర్లు లేని చోట కన్వీనర్లను నియమించడం, బూత్ ఏజెంట్లను క్రియాశీలకం చేయడం వంటి కార్యక్రమాలను డివిజనల్ పర్యటనల్లో పూర్తిచేస్తామన్నారు.

చిన్న చిన్న విభేదాలను పక్కనపెడదాం: లేళ్ల అప్పిరెడ్డి

వైఎస్సార్ సీపీ అనేది ఒక కుటుంబమని, కుటుంబ సభ్యుల మధ్య చిన్న, చిన్న విభేదాలు ఏవైనా ఉంటే పక్కన పెట్టి కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి సూచించారు. జగనన్న గెలిస్తే ఈ రాష్ట్రంలో పేదలంతా గెలిచినట్లేనని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి డివిజన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేసే కష్టమే జగనన్నను సీఎంను చేస్తుందని తెలిపారు. నగర మేయర్ కావటిమనోహర్‌నాయుడు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమలో తెలుగుదేశం పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే దాడులు చేసేందుకు వెనుకాడటంలేదని, వారి ఆగడాలను దీటుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతా రామాంజనేయులు మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కష్టపడిపనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన నేత చంద్రగిరి ధీరజ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలరెడ్డినగర్‌లో పర్యటన

డివిజన్‌ల వారీ పర్యటనలో భాగంగా నేడు తొలి రోజున శుక్రవారం నియోజకవర్గంలోని ముత్యాలరెడ్డినగర్‌లో పర్యటిస్తున్నట్లు మంత్రి విడదల రజిని చెప్పారు. డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తామని స్పష్టం చేశారు.

జీవితంలో ఎదిగేందుకు చదువు ఒక్కటే మార్గం

డీఈఓ పి.శైలజ



మాట్లాడుతున్న డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆడ పిల్లలు, మహిళలకు జీవితంలో ఎదిగేందుకు చదువు ఒక్కటే ఏకైక మార్గమని డీఈఓ పి. శైలజ పేర్కొన్నారు. గురువారం బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం, వాసవి క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో విద్యార్థినులు కూర్చునేందుకు బల్లలు, ఆఫీస్ ఫర్నీచర్ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ శైలజ మాట్లాడుతూ ఎవరికైనా చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ముఖ్యంగా బాలికలకు విద్య ఎంతో అవసరమన్నారు. ఎవరైతే తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగుతారో వారు జీవితంలో ఖచ్చితంగా ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటు పడి జీవితాలను నాశం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని చదువుతో పాటు కళల్లో రాణించాలని తెలిపారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం లేని విద్య వ్యర్థమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎ.సుధాకరరెడ్డి, మూల్పూరి ఉపేంద్ర, సీహెచ్ కృష్ణంరాజు, ఎం.శ్రీనివాసరావు, వాసవిక్లబ్ ప్రతినిధులు కె. వెంకట నగేష్, పీవీ శివనాగ ఆంజనేయులు, గ్రంధి శ్రీనివాస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, శారదానికేతన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి. శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్. ఉషాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగనన్నే మా నమ్మకం'

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీ నగర్‌లో 'బాబూ ఆపు నీ నాటకం–జగనన్నే మా నమ్మకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 79వ సచివాలయ కన్వీనర్ నాగలక్ష్మి, క్లస్టర్–20 గృహ సారథులు గడప, గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ప్రభుత్వం పెంచిన పెన్షన్ రూ.3వేలు నగదును పంపిణీ చేశారు. నవరత్నాల ప్రగతి పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి శివరావుకు సేవా స్ఫూర్తి అవార్డు

నగరంపాలెం: వీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ (హైదరాబాద్) 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సేవా స్ఫూర్తి అవార్డుని ప్రకటించినట్లు విశ్రాంత ఉద్యోగి పలకలూరి శివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్ తిలక్ రోడ్‌లోని తెలంగాణ సరస్వత్ పరిషత్ భవనంలో అవార్డు ప్రదానం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. శివరావుకి అవార్డు ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

7న ఆరోగ్య సభ

లక్ష్మీపురం: అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7న జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్ సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్య సభలో శ్రావణి హాస్పిటల్ అధినేత, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పోసాని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య సలహాలు, సూచనలు అందజేస్తారని పేర్కొన్నారు.

వైభవంగా దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు, భక్తులు

నగరంపాలెం: టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనురాస్మాన్ని పురస్కరించుకుని గురువారం బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై భక్తి శ్రద్ధలతో దీపోత్సవం నిర్వహించారు. తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి తిరుప్పావైలోని 21వ కుత్తు విళక్కు – విశేష పాశురం ప్రవచిస్తూ లోకమంతా జ్ఞాన దీపాలు ప్రకాశించాలని అన్నారు. ధర్మ రక్షణలో అందరూ భాగస్వాములై భారతీయ సంస్కృతిని పరిరక్షించాలని పేర్కొన్నారు. తద్వారా భావి తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరూ చేపట్టాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి దీపోత్సవాన్ని ప్రారంభించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ఆరోగ్య భరోసా

గుంటూరు రూరల్: ప్రజల ఆరోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పొత్తూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడుతూ కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య చికిత్సలు అందించటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సమీర, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ కిరణ్, శ్యామల బ్రహ్మారెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి ముందుకు రావటం అభినందనీయం

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వైద్య పరికరాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి అభివృద్ధికి ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి ముఖ్యంగా చిరుద్యోగులు ముందుకొచ్చి విరాళాలు అందించటం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్లు, ఆయమ్మలు తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ రోగులకు ఉపయోగపడే వస్తువులను అందించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా గురువారం ల్యాబ్ టెక్నీషియన్లు అయిదు కంప్రెసర్ నెబులైజర్‌లు, కాన్పుల వార్డులో పని చేసే ఆయమ్మలు పుస్తకాలు, పెన్నులను అందచేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు నాగేశ్వరావు, సుధశ్రీ, ఆయమ్మలు రోజ్ మేరీ, జోస్పిన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక వార్డులు..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)ను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రి శుశ్రుత హాలులో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఈహెచ్ఎస్ అమలు తీరు పై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నిష్ణాతులైన వైద్యులు ఉన్నారన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారని, అనుభవం ఉన్న వైద్యులు ఉండటం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు జీజీహెచ్‌లో వైద్యం కోసం ఇష్టపడుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక రూమ్‌లను కేటాయిస్తామని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ చీకటి విజయ్‌ప్రకాష్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వద్దాది వెంకట కిరణ్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకట సతీష్ కుమార్, ఆరోగ్య శ్రీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకున్న బజరంగ్ ఫౌండేషన్



శ్యాంసన్‌కు ట్రై సైకిల్ అందజేసిన అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం: బజరంగ్ ఫౌండేషన్ ఇద్దరు దివ్యాంగులను ఆదుకుంది. వారి రాకపోకలు సాగించేందుకు రెండు ట్రై సైకిళ్లను అందించారు. దివ్యాంగులైన ములుకుదురు గ్రామంలోని వేరుచెర్ల ఆదిశేషు, మాచవరం గ్రామవాసి తలతోటి శ్యాంసన్ నడవలేని పరిస్థితి. శ్యాంసన్ ఓ దర్జీ వద్ద గుండీలు కుట్టి జీవనం సాగిస్తున్నాడు. అతడిని ఇంటి నుంచి దుకాణానికి తీసుకు రావాలన్నా ఎవరైనా సహాయం చేయాల్సిందే.. ఇక ఆదిశేషు కదల్లేని స్థితిలో ఇంటి వద్దనే ఉండేవాడు. నిరుపేదలైన వీరిద్దరి గాధను బజరంగ్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ, బృంద సభ్యులు ములుకుదురు, మాచవరం గ్రామాలకు గురువారం వెళ్లారు. కదల్లేని ఆ ఇద్దరి దివ్యాంగులకు దివ్యాంగ దర్శినిలో భాగంగా ట్రై సైకిళ్లను అందజేశారు. తమ జీవనాధారానికి అవసరమైన సైకిళ్లను అందజేసిన అంబటి మురళీకృష్ణకు ఆ రెండు కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

ఏఎన్‌యూ రిజిస్ట్రార్, ఆచార్య బి.కరుణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రానికి విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్నారని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి.కరుణ అన్నారు. ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రంలో ప్రవేశాలు పొందిన తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులకు గురువారం వర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ కరుణ మాట్లాడుతూ దూరవిద్య కేంద్రంలో చదివిన విద్యార్థులకు రెగ్యులర్ విధానంలో చదివిన విద్యార్థులకు ఎటువంటి వ్యత్యాసం ఉండదన్నారు. దూరవిద్యలో చదివిన వారు ఉన్నత విద్యను, ఉద్యోగ అవకాశాలను పొందటానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ దూర విద్యలో విద్యార్థులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు సమస్యలు పరిష్కరించి వారికి అవసరమైన సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యాల కల్పనలో ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.సోమశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం దూర విద్య, రెగ్యులర్ విద్యార్థుల డిగ్రీలకు వ్యత్యాసం లేదని, దూరవిద్య డిగ్రీలతో న్యాయస్థానాల్లోనూ, సివిల్ సర్వీసెస్‌లోనూ ఉద్యోగాలు పొంది ఉన్నతంగా రాణిస్తున్న వారు కూడా ఉన్నారని తెలియజేశారు. వక్తలు డాక్టర్ తాసిఫ్ అహ్మద్ డాక్టర్ పుణ్యశేఖర్, అకడమిక్ కౌన్సిలర్స్, దూర విద్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

గ్రంథాలయ తనిఖీలో జేసీ జి.రాజకుమారి



పాఠకులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల్లో పాఠకులు కోరిన గ్రంథాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో గ్రూప్–1, 2తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు కావాల్సిన పుస్తకాలు, మెటీరియల్స్ పై ఆరా తీశారు. వాటిని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. సదుపాయాలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా గ్రంథాలయానికి వస్తూ, అవసరమైన పుస్తకాలను కోరినట్లయితే వాటిని సరఫరా చేస్తామని జేసీ చెప్పారు. విద్యార్థులు, గృహిణులు, పోటీ పరీక్షల శిక్షణార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట గ్రంథ పాలకులు శకుంతల, సత్య శిరీష ఉన్నారు.

గోగినేని కనకయ్య సేవలు చిరస్మరణీయం



కనకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యక్తి ఉజ్వల భవిష్యత్తు విద్య ద్వారానే సాధ్యమవుతుందనే భావనతో విద్యాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్వాన్ గోగినేని కనకయ్య సేవలు మరువలేనివని నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు.

గురువారం జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో గోగినేని కనకయ్య 107వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణలోని కనకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్య ద్వారానే మనిషి ఉన్నత శిఖరాలను చేరుకోగలరనే భవిష్యత్ ఆలోచనతో నాడు కనకయ్య స్థాపించిన విద్యా వ్యవస్థల ద్వారా ప్రస్తుతం ఎంతోమంది ఉన్నత శిఖరాలను చేరుకున్నారని శ్రీనివాస్ అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోటూరి రవికుమార్, మాజీ మేయర్ రాయపాటి మోహన్ సాయికృష్ణ, కళాశాల కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఆర్వీఆర్ ప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ చేయించుకున్నవారితో డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ మూడో యూనిట్ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు ఆయన వెల్లడించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం ఆర్‌కేజీ పాలెంకు చెందిన వెంకట నరసమ్మ గత రెండు నెలల నుంచి కామెర్ల వ్యాధితో బాధ పడుతుంది. చికిత్స కోసం 2023 నవంబర్‌లో జీజీహెచ్ వచ్చింది. జనరల్ మెడిసిన్ వైద్యులు పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి పంపించారు. వారు రోగి కామెర్ల వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించి వ్యాధి తీవ్రతను బట్టి స్టెంట్ వేశారు. స్టెంట్ వేస్తున్న సమయంలో ఎండోస్కోపీలో క్యాన్సర్ గడ్డ ఉందని గుర్తించి జనరల్ సర్జరీ మూడో విభాగానికి రిఫర్ చేసినట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గతేడాది నవంబర్29వ తేదీన వార్డులో చేర్చుకుని వివిధ పరీక్షలు చేసిన తర్వాత చిన్న పేగులో క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే ఆపరేషన్ చేయాలని నిర్ణయించి గత నెల డిసెంబర్ 20న అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ నాలుగు గంటల్లో చేశామన్నారు. సుమారు రూ.8 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామన్నారు. ప్యాంక్రియాస్‌కు చిన్న పేగులో క్యాన్సర్ గడ్డ ఉందని గుర్తించి క్యాన్సర్ గడ్డను తొలగించామన్నారు. చిన్నపేగును అతికించిన తర్వాత ఏమాత్రం లీక్ అయినా ప్రాణానికే ముప్పు ఉండేదని, రోగికి కష్టతరమైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశామని వెల్లడించారు. రోగి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో గురువారం డిశ్చార్జి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందా నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాస్, ఎస్ఆర్ డాక్టర్ మాధవి, పీజీలు డాక్టర్ సల్మా, డాక్టర్ తన్మయ, డాక్టర్ సందీప్ పాల్గొన్నట్లు వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొని రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులను డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పౌరాణిక కళాకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన శ్రీనివాసరావు, సభ్యులు

పాత గుంటూరు: పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం 27వ వార్షికోత్సవం పురస్కరించుకొని గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 6, 7 తేదీలలో పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శించనున్నట్లు సంఘం అధ్యక్షుడు నలక శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విజ్ఞాన మందిరంలో కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండురోజులపాటు రామాంజనేయ యుద్ధం, భవాని శీను, శ్రీ కృష్ణ రాయబారం, బాల నాగమ్మ, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర వంటి అనేక పౌరాణిక పద్యనాటకాల ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. కళాకారులు, నాటకాభిమానులు పాల్గొని ప్రదర్శనలు వీక్షించాలని కోరారు. సమావేశంలో సంస్థ గౌరవాధ్యక్షుడు చెన్నుపాటి కృష్టారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సనిశెట్టి సాంబశివ రావు, తన్నీరు దానరావు, బండి శ్రీకాంత్, మురుగు సూరినారాయణ, తన్నీరు రమణ, తోట శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.